సాక్షి విజయనగరం

మంగళవారం । 7 । మే । 2024



'ఆశ'ల జీవితాల్లో వేతన వెలుగులు

ఆశ వర్కర్లకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మేలు చేసింది. చంద్రబాబు హయాంలో నెలకు ఇచ్చే రూ.3వేలను రూ.10వేలకు పెంచి సంతోషాన్ని నింపింది. - 8లో



చంద్రబాబువి నీచ రాజకీయాలు

పేదవారి ఆకలితో తెలుగుదేశం పార్టీ నాయకులు నీచ రాజకీయాలు చేస్తున్నారని, అటువంటివి మానుకోవాలని మంత్రి బొత్స సత్యనారాయణ హితవు పలికారు. - 8లో



సంక్షేమ పాలన మెచ్చి...

వైఎస్సార్‌సీపీ సంక్షేమ పాలన మెచ్చి ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. - 8లో

న్యూస్‌రీల్

జగనన్నకే జై



జగనన్నకే మా మద్దతు అంటూ వైఎస్సార్‌సీపీ కరపత్రాలు చూపుతున్న యువతులు

రామభద్రపురం: విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్ మెంట్, విద్యాకానుక, అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతిదీవెన, విదేశీ విద్యాదీవెన వంటి పథకాలు అమలుచేస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పక్షాన యువత నిలబడుతోంది. విద్యార్థులకు మేలుచేసే సీఎంకు జై కొడుతోంది.

ఘాట్ రోడ్లలో భారీ వాహనాల రాకపోకలు నిషేధం

- ఈనెల 10 నుంచి 14 వరకు అమలు
- జిల్లా ఎన్నికల అధికారి విజయసునీత

సాక్షి,పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): జిల్లాలోని ఘాట్ రోడ్లలో ఈనెల 10 నుంచి 14వ తేదీ వరకు భారీ వాహనాల రాకపోకలను నిషేధిస్తున్నట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.విజయసునీత సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 13న సార్వత్రిక ఎన్నికల పోలింగ్ దృష్ట్యా సిబ్బంది, సామగ్రిని తరలించేందుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రెవెన్యూ, పోలీసు, ఆర్‌అండ్‌బీ శాఖలు ముందస్తు చర్యలు చేపట్టినట్టు ఆమె పేర్కొన్నారు. విజయనగరం జిల్లాలోని బొడ్డవర నుంచి అనంతగిరి, అరకులోయ మీదుగా పాడేరు జాతీయ రహదారి, వడ్డాది-పాడేరు ఘాట్ రోడ్డు, లంబసింగి, మారేడుమిల్లి-భద్రాచలం ఘాట్‌రోడ్ల మార్గాల్లో భారీ వాహనాల రాకపోకలపై నిషేధం ఉంటుందన్నారు. ఈ రోడ్లపై భారీ వాహనాలు, మల్టీ ఎక్సెల్ సిమెంట్, స్టీల్ రవాణా చేసే వాహనాల రాకపోకలను ఆయా తేదీల్లో నిషేధిస్తున్నామని తెలిపారు. వాహనదారులంతా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ విజయసునీత సూచించారు.

జూలై నుంచి వలంటీర్లతో పింఛన్ల పంపిణీ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

దత్తిరాజేరు: వైఎస్సార్‌సీపీ రెండోసారి అధికారంలోకి వస్తుందని, ముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విశాఖ వేదికగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత ఎప్పటివలే వలంటీర్లతో పింఛన్ల పంపిణీ జరుగుతుందని ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య అన్నారు. విజయనగరంలో తన ఇంటి వద్ద 'సాక్షి'తో సోమవారం మాట్లాడారు. చంద్రబాబు ప్రకటించిన తప్పుడు మేనిఫెస్టోను ప్రజల నమ్మరని, గతంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలుచేయకపోవడమే దీనికి కారణమన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారంటే చేస్తారన్న నమ్మకం ప్రజల్లో ఉందన్నారు. గతంలో ఓటు వేయని కుటుంబాలకు సైతం జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో సంక్షేమ పథకాలు అందాయని, టీడీపీ పాలనలో కంటే వైఎస్సార్‌సీపీ హయాంలోనే మేలు జరిగిందని, టీడీపీ మద్దతుదారులందరూ ఈ సారి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. జగనన్న పాలనకు మహిళా లోకం జై కొడుతోందని తెలిపారు.

వెనుకబాటును వెనక్కినెట్టేద్దాం

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే సంక్షేమం, అభివృద్ధి
- దుష్ప్రచారమే అస్త్రంగా టీడీపీ నాయకుల రాజకీయం
- ఏ ప్రభుత్వంతో ప్రయోజనమో ప్రజలకు తెలుసు
- ఆలోచించి ఓటు వేయకపోతే భవిష్యత్తుకు చేటు
- సాక్షి ప్రత్యేక ఇంటర్వ్యూలో ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



సాక్షి ప్రతినిధి, విజయనగరం:

ఉమ్మడి విజయనగరం జిల్లాలో శృంగవరపుకోట నియోజకవర్గం ఇంకా వ్యవసాయ ఆధారిత ప్రాంతమే. ఇక్కడి ప్రజల ఓట్లతో టీడీపీ నాయకులు దశాబ్దాలుగా పదవులను అనుభవించినా చేసిన అభివృద్ధి శూన్యం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాతే మార్పు మొదలైంది. 'సంక్షేమం, అభివృద్ధికి అసలైన నిర్వచనాన్ని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చారు. ఎన్నికల్లో ప్రజల ముందుకు వచ్చినప్పుడు తాము ఏం చేశామో చెప్పాలి... ఓటేస్తే ఏం చేస్తామో చెప్పాలి. కానీ టీడీపీ నాయకులు చెప్పుకోవడానికి ఏమీ లేకే వైఎస్సార్‌సీపీపై దుష్ప్రచారాన్నే అస్త్రంగా చేసుకుంది. ఏ ప్రభుత్వంతో ప్రయోజనమో ప్రజలకు తెలుసు. ఆలోచించి ఓటు వేయకపోతే భవిష్యత్తుకు చేటు' అని శృంగవరపుకోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. ఇదే నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా మరోసారి బరిలోకి దిగిన ఆయన ఎన్నికల ఏర్పాట్లలో తలమునకలై ఉన్నారు. ఈ సందర్భంగా సాక్షికి ప్రత్యేకంగా ఇంటర్వ్యూ ఇచ్చారు.

సాక్షి: 2024 సార్వత్రిక ఎన్నికల్లోనూ మీ వ్యూహం ఏమిటి?
కడుబండి: ప్రత్యేక వ్యూహాలు ఏమీ లేవు. గత 58 నెలల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి, ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను ప్రచారం చేయడం, అందరికీ అన్నివేళలా అందుబాటులో ఉండడం, అవినీతి రహిత పాలన అందివ్వడం, నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ విధేయత, విశ్వసనీయత, నమ్మకంగా ఉండడం. అందరికీ సమాన అవకాశం, గౌరవం ఇస్తూ పనిచేయడమే బలం.

సాక్షి: ఎస్.కోటలో బలపడ్డామని కూటమి పార్టీల ప్రచారం మాటేమిటి?
కడుబండి: వైఎస్సార్‌సీపీ బలంగా ఉంది. చెప్పాలంటే ఇంకా పెరిగింది. కచ్చితంగా మెరుగైన మెజార్టీ సాధిస్తాం. ఇటీవల పార్టీలోకి చేరికలే సాక్ష్యం. టీడీపీ నాయకులు దుష్ప్రచారం చేస్తే ప్రజలు వైఎస్సార్‌సీపీని వద్దనుకుంటారా? ఎవరేమిటో ప్రజలకు తెలుసు. గాంధీజీ కలలుగన్న స్వరాజ్యాన్ని, సంక్షేమాన్ని ఇన్నేళ్ల తర్వాత ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంతోనే సాధ్యమైంది. అర్హత ఒక్కటే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికీ వెతికి వెతికి ఇచ్చారు. కూటమి ప్రభావం లేదు. ఫైట్ మళ్లీ టీడీపీతోనే.

సాక్షి: కరోనా కష్టకాలం సహా ప్రజల్లోనే ఉన్నారు. ఇంకా ఏమైనా ఎన్నికల ప్రచారంలో చెబుతున్నారా?
కడుబండి: కరోనా కష్టకాలంలో మేము ప్రజలకు అండగా ఉన్నాం. ఇప్పుడు కనిపిస్తున్న టీడీపీ నాయకులు అప్పుడు ఎక్కడున్నారో అందరికీ తెలుసు. గత ఎన్నికల్లో చెప్పినవన్నీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేశారు. ఇప్పుడు ఆ పథకాలనే మరింత సాయం పెంచి కొనసాగిస్తామని చెప్పారు. బడ్జెట్ అనుకూలతను బట్టి మరికొన్ని నిర్ణయాలు తీసుకుంటామన్నారు. అంటే ఏదో ఓట్ల కోసం ఆచరణ సాధ్యంకాని హామీలిచ్చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత రకరకాల సాకులతో కోత వేసే ప్రభుత్వం కాదు మాది. చెప్పింది చేశాం... చేసిందే చెబుతున్నాం.

సాక్షి: నియోజకవర్గంలో మీ హయాంలో జరిగిన అభివృద్ధి గురించి ఏం చెబుతారు?
కడుబండి: జలజీవన్ మిషన్‌లో భాగంగా రూ.216 కోట్ల ఖర్చుతో 270 గ్రామాల్లో ఇంటింటికి కుళాయి పనులు ప్రారంభించాం. 90 గ్రామాల్లో పనులు పూర్తయ్యాయి. 180 గ్రామాల్లో పనులు పురోగతిలో ఉన్నాయి. ఎస్.కోటలో 30 పడకల సీహెచ్‌సీని వంద పడకల ఏరియా ఆస్పత్రిగా మార్చాం. రూ.12.60 కోట్లు మంజూరు చేశాం. పనులు జరుగుతున్నాయి. పెందుర్తి నుంచి బొడ్డవర వరకూ ఉన్న అరుకు రోడ్డును నేషనల్ హైవేగా మార్చాం. దారపర్తి పంచాయతీ పరిధి గిరిశిఖర గ్రామాల్లో డోలీమోతలు ఉండకూడదని దబ్బగుంట నుంచి పల్లపుదుంగాడకు రూ.4,89 కోట్లుతో బీటీ రోడ్డు శాంక్షన్ చేశాం. పనులు జరుగుతున్నాయి. బొడ్డవర పంచాయతీలో బొడ్డవర-చిట్టంపాడు రోడ్డుకు రూ.10.75. కోట్లు మంజూరయ్యాయి. సోంపురం-ఆనందపుం రోడ్డు పూర్తయ్యింది. ధర్మవరం హైస్కూల్‌లో బాలికల జూనియర్ కళాశాల ఏర్పాటు చేశాం. ఐదు పీహెచ్‌సీలకు అదనపు భవనాల నిర్మాణ పనులు చేశాం. మరో మూడు పీహెచ్‌సీల మరమ్మతులకు నిధులు కేటాయించాం. నాడు-నేడులో 90 శాతం పాఠశాలల రూపురేఖలు మార్చాం. 10వేల మందికి ఇళ్ల స్థలాలిచ్చి ఇళ్లు కేటాయించాం. గ్రామాల్లో 94 సచివాలయాలు, 87 ఆర్‌బీకేలు, 75 వెల్‌నెస్ సెంటర్లు మా ప్రభుత్వం చేసిన అభివృద్ధికి సాక్ష్యాలు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రతి గ్రామానికి వెళ్లి ప్రజల సమస్యలు చూశాం. తక్షణ పరిష్కారానికి 608 పనులు గుర్తించి వెంటనే నిధులు ఇచ్చాం. ఇలా నిత్యం ప్రజాభివృద్ధి ధ్యేయంగా పనిచేశాం.

సాక్షి: మీ ప్రత్యర్థుల దుష్ప్రచారం మాటేమిటి?
కడుబండి: జగనన్న ఇచ్చిన పదవులతో అధికారం అనుభవిస్తూ వాటికి రాజీనామా చేయకుండా ప్రత్యర్థి పార్టీ పచ్చకండువాలు వేసుకున్న బ్యాచ్‌ని చూసి జనం నవ్వుకుంటున్నారు. వారి ఆరోపణల్లో వాస్తవాలేమిటో జనానికి తెలుసు. టీడీపీ నాయకులు గత చంద్రబాబు ప్రభుత్వ హయాంలో నీరు-చెట్టు పేరుచెప్పి సాగించిన మట్టి అమ్మకాలు, ప్రభుత్వ పోస్టుల అమ్మకాలు, తి.తి.దే దర్శనం టోకెన్లు, దందాలు, జన్మభూమి కమిటీల అరాచకాలను ప్రజలు మరచిపోలేదు. వాళ్ల రెబల్ అభ్యర్థే మీడియా ముందుకొచ్చి గొంతెత్తారు. ఇక వాళ్లు చేసే దుష్ప్రచారాన్ని ప్రజలే తిప్పి కొడతారు.

సాక్షి: నియోజకవర్గంలో మీ భవిష్యత్తు కార్యాచరణ ఎలా ఉంటుంది?
కడుబండి: శృంగవరపుకోట నియోజకవర్గం దీర్ఘకాలంగా వెనుకబడి ఉంది. వలసలు ఎక్కువ. వ్యవసాయ ఆధారంగా జీవించేవారే అధికం. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని భవిష్యత్తు ప్రణాళిక ఉంది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే విశాఖనగరాన్ని రాష్ట్ర పరిపాలన రాజధాని చేస్తానని ఇప్పటికే వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విస్పష్టంగా చెప్పారు. తద్వారా అత్యధికంగా మేలు జరిగేది ఈ నియోజకవర్గానికే. పారిశ్రామిక విస్తరణకు అవసరమైన ప్రభుత్వ భూములు మెండుగా ఉన్నాయి. మానవ వనరులు ఉన్నాయి. యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. ఒకవైపు జాతీయ రహదారి, మరొకవైపు గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేలు వస్తున్నాయి. ఉత్తరాంధ్ర సర్వతోముఖాభివృద్ధి జగనన్నతోనే సాధ్యం. జిందాల్ అల్యూమినా రిఫైనరీ వస్తే 2వేల మందికే ఉపాధి. కానీ నేడు ఆ జిందాల్ భూముల్లో ఎంఎస్‌ఎంఈ లాజిస్టిక్స్ పార్కు ఏర్పాటు వల్ల సుమారు 6 వేల మందికి ప్రత్యక్షంగానూ, మరో పది వేల మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుంది. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పూర్తయితే ప్రతి ఎకరానికి సాగునీరు వస్తుంది.

పింఛన్ అందలేదన్న బెంగతో వృద్ధుడి మృతి

మెరకముడిదాం: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, నిమ్మగడ్డ రమేష్ ఎన్నికల సంఘానికి చేసిన ఫిర్యాదు ఫలితం మరో వృద్ధుడిని బలితీసుకుంది. పింఛన్ అందలేదన్న బెంగతో మెరకముడిదాం మండలం రామాయవలస సచివాలయం పరిధిలోని ముచ్చపైడయ్య (72) అనే వృద్ధుడు చనిపోయాడు. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. పైడియ్యకు భార్య, పిల్లలు లేరు. కొన్నేళ్లుగా సోమలింగాపురంలో నివసిస్తున్న ఆయన వదిన కుమారుడు తవుడు వద్ద ఉంటున్నాడు. ఆయనకు ప్రతినెలా ప్రభుత్వం మంజూరు చేసిన రూ.3వేలు ఫించన్‌ను వలంటీరు ఇంటికి తెచ్చి అందించే వాడు. మే నెల పింఛన్ డబ్బులు మెరకముడిదాంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు (ఏపీజీవీబీ)లోని ఆయన ఖాతాకు జమయ్యాయి. దీనికోసం నాలుగు రోజులుగా తిరుగుతున్నాడు. బ్యాంకు ఖాతా స్తంభించిపోవడంతో వేలిముద్రలు వేయాల్సి వచ్చింది. ఆయన వేలిముద్రలు సరిగా నమోదుకాకపోవడంతో పింఛన్ డబ్బులు చేతికి అందలేదు. బ్యాంకు, సచివాలయ సిబ్బంది ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. పింఛన్ మరి అందదేమోనంటూ గ్రామస్తులు, వదిన కుమారుడు వద్ద తరచూ వాపోయాడు. పింఛన్ అందుతుందని ధైర్యం చెప్పినా మనస్థాపానికి గురై ఆదివారం అర్ధరాత్రి పైడయ్య మృతిచెందినట్టు బంధువులు తెలిపారు.



పైడయ్య మృతదేహం, (ఇన్‌సెట్లో) ముచ్చపైడయ్య (ఫైల్)

అభిమాన జల్లు

ప్రచార పర్వం

ఎన్నికల ప్రచారానికి ఊరూరా వెళ్తున్న ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు ప్రజలు సాదరంగా స్వాగతం పలుకున్నారు. హారతిచ్చి విజయతిలకం దిద్దుతున్నారు. మా కుటుంబానికి ఆర్థికంగా మేలు జరిగిందని, ఓటు తప్పకుండా వేస్తామని మాట ఇస్తున్నారు. ప్రచారంలో భాగస్వాములవుతున్నారు.



గజపతినగరం మండలం పురిటిపెంటలో ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఊరంతా ఆయనకు మద్దతుగా నిలబడింది.



మెరకముడిదాం మండలం భైరిపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహించిన మంత్రి బొత్స సత్యనారాయణకు అక్కడి మహిళ హారతిచ్చి స్వాగతం పలికారు. మా మంచి నాయకుడివి నీవేనంటూ ఆశీస్సులు అందించారు.



వంగర మండలం మద్దివలస వాసులు వైఎస్సార్‌సీపీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్‌కు ఘనంగా స్వాగతం పలికారు. ప్రచారంలో భాగస్వాములయ్యారు. ఫ్యాన్ గుర్తుకే మా ఓటు అంటూ నినదించారు.



బొబ్బిలి పట్టణంలోని 17, 18 వార్డుల్లో ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయనకు వార్డు వాసులు మద్దతు తెలిపారు.



లక్కవరపుకోట మండలం జమ్మాదేవిపేటలో ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి సంక్షేమ పాలనకు మద్దతు ఇవ్వాలని ఓటర్లను అభ్యర్థించారు.



డెంకాడ మండలం గుణుపూరుపేటలో ఎన్నికల ప్రచారానికి వెళ్లిన ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడుకు ఊరంతా మద్దతు తెలిపింది. ఆయన కోలాట బృందంతో అడుగు కలిపి పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపారు.

అమ్మో అదితి..!

- ఆమె పేరు చెబితేనే భయపడుతున్న విజయనగర వాసులు
- గతంలో ఆమె చర్యలను తలచుకుంటున్న చిరువ్యాపారులు
- కోట చుట్టూ షాపులను నిర్దాక్షిణ్యంగా ఎత్తివేయించిన వైనం
- బతుకులు రోడ్డు పాలు
- తండ్రి అధికారాన్ని అడ్డంపెట్టుకుని ప్రశ్నించిన వారిపై బెదిరింపులు
- ఆమెకు పొరపాటున అధికారం ఇస్తే.. రాజులు దానం చేసిన స్థలాలన్నీ లాక్కుంటారన్న భయం

విజయనగరం:

అదేమీ రోడ్డు కాదు.. మున్సిపల్ అధికారులు చేపట్టాల్సిన రోడ్డు విస్తరణలో భాగమూ కాదు.. ఒక్క మాటలో చెప్పాలంటే మున్సిపాలిటీకి ఆ స్థలాలతో సంబంధం లేదు.. 'ఆమె' డైరెక్షన్ ఇచ్చారు.. అంతే.. సంబంధిత ట్రస్టు సభ్యులు రోడ్డెక్కే పని లేకుండా.. చేతులకు మట్టి అంటకుండా అధికారులు పని కానిచ్చేశారు. ఏళ్ల తరబడి ఆ ప్రాంతాల్లో ఉపాధి పొందుతున్న వారి పొట్టలు కొట్టారు. వందలాది మంది పేదల జీవితాలను రోడ్డు పాల్జేశారు. ఇదంతా జరిగింది ఎక్కడో కాదు.. విజయనగరం జిల్లా కేంద్రం నడిబొడ్డున గల మహారాజుల కోట పరిసరాల్లోనే. ఆ స్థలాలు ఎవరివో కాదు.. స్వయానా కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు ట్రస్టీగా వ్యవహరిస్తున్న మాన్సాస్‌కు చెందినవే. అధికార పార్టీ నేతల ఒత్తిళ్లతో చిరువ్యాపారుల బతుకులు రోడ్డున పడిన తీరు ఆరేళ్లయినా కళ్లముందే కదలాడుతోంది. అదితి గజపతిరాజు టీడీపీ నుంచి నియోజకవర్గ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తరుణంలో నగర వాసులు భయపడుతున్నారు. అధికారంలోకి వస్తే ఇంకెంతమంది ఉపాధి కోల్పోవాల్సి వస్తోందోనని హడలెత్తిపోతున్నారు. తన తండ్రి అధికారాన్ని అడ్డంపెట్టుకుని విజయనగరంలో పెత్తనం చెలాయించిన ఆమెకు.. పొరపాటున అధికారం చేతికొస్తే పేదల పొట్టకొడతారన్న చర్చ జోరందుకుంది.



తండ్రి అధికారాన్ని అడ్డంపెట్టుకుని..

2014 సంవత్సరంలో టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత చారిత్రాత్మక నేపథ్యం కలిగిన విజయనగరం మహారాజా కోట పరిసరాలను పర్యాటక శాఖ ఆధ్వర్యంలో అభివృద్ధి చేశారు. ఇందులో భాగంగా కోటకు పడమర దిక్కులో పార్కు తరహాలో తయారు చేసేందుకు 2016 నుంచి పనులు ప్రారంభించారు. ఇంత వరకు బాగానే ఉన్నా దశాబ్దాల కిందట అదే మహారాజుల ప్రసాదంగా కోట పరిసరాల్లో చిన్నపాటి వృత్తులు, వ్యాపారాలు చేసుకుంటూ జీవిస్తున్న వారిని ఒక్కసారిగా రోడ్డు పాల్జేయడంపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. 2017 సంవత్సరం ఫిబ్రవరి నెలలో మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ యంత్రాంగం ఆధ్వర్యంలో ఈ ప్రాంతంలో ఉన్న వందలాది దుకాణాలను ఖాళీ చేయించేశారు. వాస్తవానికైతే ఇలా ఖాళీ చేయించే బాధ్యతను రెవెన్యూ యంత్రాంగానికి అప్పగించాలి. దీనికోసం ముందస్తుగా ట్రస్ట్ నుంచి నోటీసులు జారీ చేయాలి. నిబంధనలపై మాట్లాడేవారిని, అన్యాయమని ప్రశ్నించే వారి గొంతులను పోలీస్ బలగాలతో నొక్కేశారు. మాన్సాస్ ట్రస్టుకు పన్నులు చెల్లిస్తే మున్సిపల్ యంత్రాంగం ఆ స్థలాల నుంచి ఖాళీ చేయించడం ఎంత వరకు సమంజసమని ఆవేదన వ్యక్తంచేసినా ఫలితం లేకపోయింది. మున్సిపల్ యంత్రాంగానికి ఆ అధికారం ఎవరిచ్చారన్న ప్రశ్న తలెత్తినప్పటికీ... అప్పటికే మాన్సాస్ ట్రస్టు డైరెక్టర్‌గా ఉన్న అదితి గజపతిరాజు కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రిగా వ్యవహరిస్తోన్న తన తండ్రి అధికారంతో ప్రశ్నించే వారిని అధికారులతో బెదిరించి నోర్లు మూయించేశారన్న విషయం వెలుగుచూసింది. దీంతో ఏళ్ల తరబడి ఉపాధి పొందిన వారంతా పేద కుటుంబాలకు చెందిన వారే కావడంతో వారి వేదనను ఎవరూ పట్టించుకోలేదు. ఈ ప్రక్రియ అంతా మన్సాస్ ట్రస్ట్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్న పూసపాటి ఆనందగజపతిరాజు మరణానంతరం ట్రస్టీ ఛైర్మన్‌గా అప్పటికే కేంద్ర మంత్రిగా వ్యవహరిస్తున్న పూసపాటి అశోక్‌గజపతిరాజు నేతృత్వంలో డెరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన పూసపాటి అదితి లక్ష్మీగజపతిరాజుల డైరెక్షన్‌లో చేపట్టినట్లు అప్పట్లో పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమయ్యాయి. ఒకానొక దశలో రాజవంశానికి చెందిన పలువురు పెద్దలు అదితి గజపతిరాజు స్వలాభం కోసం వెంపర్లాడుతున్న తీరుపై అసంతృప్తి సైతం వ్యక్తంచేశారు. ఇప్పుడు అధికారం ఇస్తే రాజుల కాలంలో పేదలకు దానం చేసిన భూములను సైతం లాక్కుంటారన్న చర్చ సాగుతోంది.

ఆ ఐదేళ్లలో కోటచుట్టూనే అభివృద్ధి

2014లో టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత విజయనగరం అభివృద్ధి కోట, పరిసరాలకే పరిమితమైంది. అప్పట్లో కేంద్రమంత్రిగా ఉన్న పూసపాటి అశోక్‌గజపతిరాజు అధికారంతో మాన్సాస్ ట్రస్ట్ డైరెక్టర్‌గా ఉన్న కుమార్తె పూసపాటి ఆనంద గజపతిరాజు పట్టుబట్టి మరీ రెండు కిలోమీటర్ల పరిధిలో ఉన్న మహారాజుల కోట ప్రాంగణాన్ని అభివృద్ధి చేయించుకున్నారన్న ఆరోపణలు లేకపోలేదు. వాస్తవానికి విజయనగరంలో సుమారు 15 మార్గాల్లో 2014-19 సంవత్సరాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు మున్సిపాలిటీ శ్రీకారం చుట్టగా.. అందులో కేవలం పట్టణం నడిబొడ్డున గల కోట పరిసరాల్లో పనులు మాత్రమే నెలల వ్యవధిలో పూర్తి చేయడం గమనార్హం.

రాచరిక పాలనపై హడల్..

విజయనగరం నియోజకవర్గంలో వంశపారపర్య రాచరిక పాలనపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రధానంగా మాన్సాస్ ట్రస్ట్ డైరెక్టర్‌గా ఉన్న సమయంలోనే పూసపాటి అదితిగజపతిరాజు తన తండ్రి అశోక్‌గజపతిరాజు అధికారాన్ని ఉపయోగించుకుని సొంత ఆస్తుల పరిరక్షణకు ఇచ్చిన ప్రాధాన్యతను కళ్లారా చూసిన విజయనగరం ప్రజలు.. ఆమెను చూసి హడలెత్తిపోతున్నారు. తండ్రినే ఎదిరించి సీటు సంపాదించిన అదితికి మనమెంత అంటూ వ్యాఖ్యానిస్తున్నారు.

బాధితుల గోడు వర్ణనాతీతం..!

విజయనగరం మహారాజుల కోట పరిసరాల్లో ఆక్రమణల పేరిట తొలగించిన వారికి ప్రత్యామ్నాయం చూపించడంలో ఏ ఒక్కరికీ సంబంధం లేకుండా పోయింది. స్థలం మాన్సాస్ ట్రస్టుకు చెందగా.. ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయించినది మున్సిపల్ అధికారులు. ఆక్రమణలు తొలగించాలంటూ ఉపాధి పొందుతున్న వారిని హెచ్చరించిన సమయంలోనే వారంతా ఎదురు ప్రశ్నించినా.. ఉన్నతాధికారులు ఆదేశాలంటూ అధికార దర్పాన్ని ప్రదర్శించారు. బలవంతంగా పోలీసుల సమక్షంలో భారీ యంత్రాలతో వారి ఉపాధి గూడులను నేల మట్టం చేశారు. వారి ఆవేదనను రాజులు కనీసం పట్టించుకోలేదు.

క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల వద్ద ప్రథమ చికిత్సాకేంద్రాలు

● డీఎంహెచ్ఓ భాస్కరరావు



డీఎంహెచ్ఓ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: సాధారణ ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఏడు నియోజకవర్గాల్లోని 1847 పోలింగ్ కేంద్రాల వద్ద ప్రథమ చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు డీఎంహెచ్ఓ ఎస్. భాస్కరరావు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, పోలింగ్ కేంద్రాలకు సామగ్రి అందజేసే కేంద్రాల వద్ద 12వ తేదీన.. పోలింగ్ కేంద్రాల వద్ద 13వ తేదీన చికిత్సా కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. అదేవిధంగా స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద 13వ తేదీ సాయంత్రం శిబిరాలు ఉంటాయని తెలిపారు. ఇదిలా ఉంటే ఎన్నికల నేపథ్యంలో వైద్యారోగ్యశాఖ సిబ్బందికి ఈ నెల 11 నుంచి 15 వరకు ఎటువంటి సెలవులు మంజూరు చేయమన్నారు.

స్కూటీ దగ్ధం

సాలూరు: పట్టణంలోని డబ్బివీధి మామిడిపల్లి రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ పేలి అగ్నిప్రమాదం సంభవించడంతో ఓ స్కూటీ కాలిపోయింది. దీనిపై అగ్నిమాపక శాఖ అధికారి సుధాకరరావు తెలిపిన వివరాల ప్రకారం ..సోమవారం మధ్యాహ్నం డబ్బివీధి మామిడిపల్లి రోడ్డు పక్కన గల 160 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ పేలి, మంటలు చెలరేగాయి.ఈ అగ్నిప్రమాదంలో సమీపంలో ఉన్న స్కూటీ కాలిపోయింది. ఈ సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్లి మంటలు అదుపుచేశారు. పేలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ విలువ సుమారు రూ.17 లక్షలు ఉంటుందని ఎలక్ట్రికల్ ఎ.డి రంగారావు తెలిపారు.

పీహెచ్‌సీలో సాధారణ ప్రసవాలు జరిగేలా దృష్టి

● డీఎంహెచ్ఓ కె.విజయపార్వతి



బందలుప్పి పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్ఓ కె.విజయపార్వతి

పార్వతీపురం టౌన్: పీహెచ్‌సీల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా దృష్టి సారించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ కె. విజయపార్వతి అన్నారు. ఈ మేరకు ఆమె పార్వతీపురం మండలంలోని డోకిశీల, బందలుప్పి పీహెచ్‌సీలను సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న కాన్పుల రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. ల్యాబొరేటరీ, వ్యాక్సిన్, మందుల నిల్వలు పరిశీలించారు. అనంతరం పీహెచ్‌సీలో సిబ్బందితో మాట్లాడుతూ సాధారణ కాన్పులు జరిగేలా దృష్టి సారించాలని ఆదేశించారు. అక్కడి రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య సమస్యలు తెలుసుకున్నారు. వడదెబ్బ, డీహైడ్రేషన్ సమస్యలు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓఆర్ఎస్ అన్ని గ్రామాల్లో అందుబాటులో ఉంచాలని, టీకా కార్యక్రమాలను గ్రామాల్లో త్వరగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఆశ కార్యకర్తలు వారి పరిధిలో ఉన్న గర్భిణులు, బాలింతల ఆరోగ్య జాగ్రత్తల గురించి ఫోన్ 0124441660 నంబర్ నుంచి వచ్చే కిల్కారీ సందేశాన్ని వినేలా పర్యవేక్షణ చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ ఐశ్వర్య, డా. కౌశిక్, డెమో యోగీశ్వరరెడ్డి, సూపర్‌వైజర్స్ జయగౌడ్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘన కాదా?

● ఓటర్లకు టీడీపీ ప్రలోభాలు?



మాక్ ఈవీఎంలను పట్టుకుని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో తిరుగుతున్న టీడీపీ నాయకుడు

సాలూరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఫెసిలిటేషన్ కేంద్రంలో ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది సోమవారం తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్న వేళ కొందరు టీడీపీ నాయకులు ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేలా వ్యవహరించారు. అక్కడ వేసిన టెంట్లలో కూర్చుని, టీడీపీ అభ్యర్థికి ఓట్లు వేయాలంటూ పార్టీ గుర్తు కనిపించేలా మాక్ ఈవీఎంలను వెంటపట్టుకుని తిరిగారు. తమదైన శైలిలో ప్రలోభాలకు గురిచేసేందుకు ప్రయత్నించారు.ఇది కోడ్ ఉల్లంఘన కిందికి వస్తుందా? రాదా? అని ఎన్నికల అధికారులు పరిశీలించి, తగు చర్యలు తీసుకోవాలని పలువురు ఓటర్లు అక్కడ మాట్లాడుకోవడం తారసపడింది.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹150	₹270	₹280

ఆశల జీవితాల్లో వేతన వెలుగులు

● ఆశ వర్కర్ల జీతాలు పెంచిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
● చంద్రబాబు హయాంలో కార్యకర్తల జీతం రూ. 3 వేలు
● జగనన్న హయాంలో రూ. పది వేలకు పెంపు
● జిల్లాలో 1785 ఆశ వర్కర్లకు మేలు



గర్భిణిని ఆస్పత్రికి తరలిస్తున్న ఆశ వర్కర్లు (ఫైల్)

విజయనగరం ఫోర్ట్: చంద్రబాబు హయాంలో ఆశ వర్కర్లు ఎన్నో అవస్థలు పడ్డారు. చాలీచాలని పారితోషికాలతో కుటుంబాలను నెట్టుకురావడానికి పడరాని కష్టాలు పడ్డారు. అటువంటి సమయంలో ప్రతిపక్ష నేత హోదాలో పాదయాత్ర చేసిన జగన్ మోహన్‌రెడ్డి ఆశ వర్కర్ల ఇబ్బందులను దగ్గరనుండి చూశారు. అధికారంలోకి రాగానే జీతాలు పెంచుతామని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి రాగానే ఆశ వర్కర్ల జీతాల పెంపు ఫైల్‌పైనే మొదటి సంతకం చేశారు. వారు కూడా ఊహించని విధంగా రూ. 3 వేల నుంచి పది వేల రూపాయలకు జీతం పెంచారు. జీతాలు పెంచాలని టీడీపీ హయాంలో ఆశ వర్కర్లు ఎన్నో పోరాటాలు చేసినా ఫలితం లేకపోయింది.

1785మందికి లబ్ధి..

జిల్లాలో 1785 మంది ఆశ వర్కర్లు ఉన్నారు. వీరందరూ 2005 నుంచి విధులు నిర్వహిస్తున్నారు. ఒక్కసారిగా జీతం రూ.3 వేల నుంచి 10 వేల రూపాయలకు పెరగడంతో సమాజంలో గౌరవంగా జీవిస్తున్నామని పలువురు ఆనందంతో చెప్పారు. టీడీపీ హయాంలో ఆశ కార్యకర్తలకు పనికి తగ్గ పారితోషికం ఇచ్చేవారు. దీంతో ఒక్కో కార్యకర్తకు ఒక్కోలా జీతం వచ్చేంది. కొంతమంది రూ. వెయ్యి వస్తే మరికొంత మంది రూ.1500, రూ. 2000 వచ్చేది. అతి కొద్దిమందికి మాత్రమే మూడు వేల రూపాయలు వచ్చేది.

పారితోషికాల్లోనూ కోత...

చంద్రబాబు హయాంలో ఆశ వర్కర్లకు ఇచ్చే పారితోషికం అంతంతమాత్రమే. ఇచ్చే పారితోషికాల్లోను కోత విధించారు. ఆశ వర్కర్లు గర్భిణుల వివరాలు సేకరించడం.. టీకాలు వేయడం.. ప్రసవాలకు ఆస్పత్రులకు తీసుకెళ్లడం.. గర్భిణులకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించడం.. నవజాత శిశువులను పర్యవేక్షించడం.. క్షయ , కుష్టు రోగులకు మందులు అందించడం.. సీజనల్ వ్యాధులు ప్రబలినప్పుడు వైద్యాధికారులకు సమాచారం ఇవ్వడం వంటి విధులు నిర్వహిస్తారు. గర్భిణి నమోదుకు రూ. 300 వచ్చేవారు. దీన్ని చంద్రబాబు సర్కారు రూ. 150కి తగ్గించింది. అలాగే టీకాలు వస్తే రూ. 500 ఇవ్వాల్సి ఉండగా దాన్ని రూ. 250కు.. సమావేశాలకు హాజరైతే రూ. 300కు గాను రూ.150.. ప్రసవాలకు తీసుకెళ్తే రూ. 500కు గాను 250 రూపాయలు ఇచ్చేవారు. అన్నింటిలోనూ సగానికి సగం కోత విధించడంతో ఆశ కార్యకర్తలు ఇబ్బందులు పడ్డారు.

ఒక్కసారిగా రూ. పది వేలు

మూడు వేల రూపాయల గౌరవ వేతనంతో ఇబ్బంది పడుతున్న ఆశ కార్యకర్తలకు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి చల్లని కబురు అందించారు. జీతాన్ని మూడు రెట్లు పెంచి ఒక్కసారిగా పది వేల రూపాయలు చేయడంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. ప్రస్తుతం ప్రతి ఆశ కార్యకర్త మోములో చిరునవ్వు తొణికిసలాడుతోంది.

చంద్రబాబువి నీచ రాజకీయాలు



భైరిపురంలో మంత్రి బొత్స ఎన్నికల ప్రచారం

● భైరిపురం, ఉత్తరావల్లి, బుదరాయవలస ఎన్నికల సభల్లో మంత్రి బొత్స సత్యనారాయణ



ఉత్తరావల్లి ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

మెరకముడిదాం: పేదవారి ఆకలితో తెలుగుదేశం పార్టీ నాయకులు నీచ రాజకీయాలు చేస్తున్నారని, అటువంటివి మానుకోవాలని మంత్రి బొత్స సత్యనారాయణ హితవు పలికారు. మండలంలోని భైరిపురం, ఉత్తరావల్లి, బుదరాయవలస గ్రామాల్లో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుతో కలిసి సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు ఇస్తున్న పింఛన్లపై తెలుగుదేశం నాయకులు చేసిన రాజకీయ కుట్ర ఫలితంగా రాష్ట్ర వ్యాప్తంగా 28 మంది మృతి చెందారన్నారు. భైరిపురం గ్రామంలో సచివాలయ భవనాన్ని అభివృద్ధి చేయడంతో పాటు రైతుభరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్లను కొత్తగా నిర్మించుకున్నామన్నారు. ఉత్తరావల్లి గ్రామసభలో ఆయన మాట్లాడుతూ.. రూ. 2 కోట్లతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసుకున్నామని చెప్పారు. 2019కి ముందు ఐదు సంవత్సరాలు అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ నాయకులు మెరకముడిదాం మండలానికి ఏం చేశారో చెప్పాలన్నారు.

ఎన్నికలప్పుడు వచ్చే వారిని నమ్మొద్దు : జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

ఎన్నికల సమయంలోనే టీడీపీ నాయకులు గ్రామాలకు వస్తుంటారని, అటువంటి వారిని నమ్మవద్దని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. భైరిపురం, ఉత్తరావల్లి, బుదరాయవలస గ్రామాలను అన్ని విధాలా అభివృద్ధి చేసుకున్నామని తెలిపారు. అభివృద్ధి చేశాం కాబట్టే గ్రామాల్లో తిరిగి ఓట్లు అడుగుతున్నామని.. టీడీపీ నాయకులు ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతున్నారని ప్రశ్నించారు. అనేక సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన ప్రజలు విజ్ఞతతో వ్యవహరించి చీపురుపల్లి ఎమ్మెల్యేగా బొత్స సత్యనారాయణను, విజయనగరం ఎంపీగా బెల్లాన చంద్రశేఖర్‌ను గెలిపించాలని కోరారు.

జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావాలి : ఎంపీ బెల్లాన

సంక్షేమ ఫలాలు మళ్లీ అందుకోవాలంటే జగన్ మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఎంపీ అభ్యర్థి బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. బుదరాయవలసలో ఆయన మాట్లాడుతూ, సంక్షేమ పథకాలతో పేద, బడుగు, బలహీన వర్గాలు లబ్ధి పొందాయన్నారు. మే 13న జరగనున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటెయ్యాలని కోరారు. కార్యక్రమాల్లో డీసీఎంఎస్ చైర్మన్ ఎస్‌వీ రమణరాజు, తాడ్డి వేణుగోపాలరావు, కోట్ల విశ్వేశ్వరరావు, బూర్లె నరేష్‌కుమార్, వైస్ ఎంపీపీలు తలచుట్ల హరిబాబు, కందుల పార్వతి, మూడు గ్రామాల సర్పంచ్‌లు పప్పల విజయ, సారిక తమ్మినాయుడు, కిల్లాడ విజయ, పప్పల కృష్ణమూర్తి, పప్పల గ్రహణేశ్వరరావు, మండల సత్యనారాయణ, బాలి బంగారునాయుడు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాధితులు

రాజాం సిటీ: మండల పరిధి గురవాం గ్రామ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు వ్యక్తులు గాయపడ్డారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజాం నుంచి పాలకొండ వెళ్తున్న ఆటోను డోలపేటకు చెందిన గోవింద్ ద్విచక్రవాహనంపై వస్తూ వెనుక నుంచి ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో ఆటో అదుపుతప్పి పక్కకు పడిపోగా సారథి గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ బి.మురళితో పాటు అందులో ప్రయాణిస్తున్న పాలకొండ మండలం తంపటాపల్లికి చెందిన పకీరు, వీరఘట్టం మండలం నందివాడకు చెందిన చందు గాయపడ్డారు. ద్విచక్రవాహనదారుడు గోవింద్‌కు కూడా గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు స్పందించి క్షతగాత్రులను 108 వాహనం ద్వారా రాజాం సామాజిక ఆస్పత్రికి తరలించారు. ఆటోడ్రైవర్ మురళి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై ఎస్. భాస్కరరావు తెలిపారు.

సెంచూరియన్‌లో వక్తృత్వ పోటీలు



వక్తృత్వ పోటీల్లో ప్రసంగిస్తున్న విద్యార్థి, వేదికపై న్యాయ నిర్ణేతలు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో ఓటింగ్ ఫర్ గుడ్ గవర్నెన్స్ అనే అంశంపై సోమవారం వక్తృత్వ పోటీలు నిర్వహించారు. సీసీసీడీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో బీఎస్సీ అనస్తీషియా విద్యార్థి వహీదా మొదటి బహుమతి, నిఖిల్ రెండో బహుమతి, ప్రజ్ఞ మూడో బహుమతి సాధించారు. విజేతలను వీసీ పీకే మహంతి, రిజిస్ట్రార్ పల్లవి అభినందించారు. కార్యక్రమంలో సిబ్బంది దేవికారాణి, నూకరాజు, విజయ్‌బాబు, మోహన్‌బాబు, బెనర్జీ, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎన్నికల భారతం కవితా సంకలనం ఆవిష్కరణ

విజయనగరం టౌన్: అభ్యుదయ రచయితల సంఘం జిల్లాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం స్థానిక గురజాడ స్వగృహంలో ఎన్నికల భారతం కవితా సంకలనం ఆవిష్కరించనున్నట్లు అరసం జిల్లా ప్రతినిధి జీఎస్.చలం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాహితీవేత్తలు, అభిమానులు హాజరుకావాలని కోరారు.

సంక్షేమ పాలన మెచ్చి...

● వైఎస్సార్‌సీపీలోకి వలసల జోరు..
● కండువాలు వేసి ఆహ్వానిస్తున్న నాయకులు
● కుదేలవుతున్న ప్రతిపక్షాలు



టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం: వైఎస్సార్‌సీపీ సంక్షేమ పాలనకు మెచ్చి ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. కొద్ది రోజుల్లో ఎన్నికలున్న నేపథ్యంలో చేరికలు జోరందుకోవడంతో వైఎస్సార్‌సీపీ బలపడుతుండగా... ప్రతిపక్ష టీడీపీ, జనసేన పార్టీలు కుదేలవుతున్నాయి. విజయనగరం మండలంలోని గుండాలపేట గ్రామానికి చెందిన 25 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో సోమవారం చేరాయి. వీరందరికీ ఎమ్మెల్యే అభ్యర్థి కోలగట్ల వీరభద్రస్వామి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామానికి చెందిన వాసు, పిసిని లక్ష్మి, కంది రామకృష్ణ, చందక రాజు, తదితర 25 కుటుంబాల వారు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు మాట్లాడుతూ, పార్టీలో చేరికలే రేపటి ఎన్నికల్లో విజయానికి బలమన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కెల్ల శ్రీనివాసరావు, కంది బాలకృష్ణ, పిసిని ప్రభావతి, పద్మ, కంది ఆదిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

జనసేనకు షాక్...!

నెల్లిమర్ల రూరల్: నెల్లిమర్లలో జనసేన పార్టీకి షాక్ తగిలింది. ఆ పార్టీ మండల ఉపాధ్యక్షుడు కొత్తూరు లక్ష్మణరావుతో పాటు పూతికపేటకు చెందిన మరో 50 కుటుంబాలు జనసేనను వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. వారందరికీ మొయిదలో ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కొత్తూరు లక్ష్మణరావు మాట్లాడుతూ.. పార్టీ కోసం కష్టపడిన వారికి జనసేనలో గుర్తింపు లేదన్నారు. బీసీలను విస్మరించి స్థానికంగా లేని లోకం మాధవికి టిక్కెట్ ఇవ్వడం అన్యాయమన్నారు. వైఎస్సార్‌సీపీతో బీసీ సాధికారత సాధ్యమని నమ్మి పార్టీలోకి వచ్చామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చనమల్ల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీ పతివాడ సత్యనారాయణ, మహిళ నాయకురాలు పతివాడ కృష్ణవేణి, సర్పంచ్ లెంక గోవింద, చనమల్ల తులసి, తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స, తదితరులు

పోక్సో కేసులో ముద్దాయికి జైలు శిక్ష

విజయనగరం క్రైమ్: రూరల్ పోలీస్ స్టేషన్‌లో 2020లో నమోదైన పోక్సో కేసులో నేరం రుజువు కావడంతో ముద్దాయికి న్యాయమూర్తి కె.నాగమణి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 2,500 జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు చెప్పారని విజయనగరం రూరల్ సీఐ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మండల పరిధిలోని ద్వారపూడి గ్రామానికి చెందిన క్లోపల్లి అప్పారావు (61) అనే వ్యక్తి ఐదేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడినట్లు బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీస్‌స్టేషన్లో 2020 జనవరిలో అప్పటి ఎస్సై ప్రసన్నకుమార్ కేసు నమోదు చేశారు. ఎస్సీ, ఎస్టీ సెల్ -1 డీఎస్పీ బి.మోహనరావు దర్యాప్తు చేపట్టి నిందితుడ్ని అరెస్టు చేసి న్యాయస్థానంలో ప్రవేశపెట్టారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి నాగమణి ముద్దాయికి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. పోలీసుల తరఫున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మావూరి శంకరరావు వాదనలు వినిపించగా.. ప్రస్తుత డీఎస్పీ ఆర్.గోవిందరావు పర్యవేక్షణలో రూరల్ సీఐ ఎం.శ్రీనివాసరావు, ఎస్సై ఆర్.వాసుదేవ్, కోర్టు ఉమెన్ కానిస్టేబుల్ టి.లక్ష్మి, సీఎంఎస్ హెచ్‌సీ రామకృష్ణ సాక్షులను సకాలంలో కోర్టులో హాజరుపర్చారు.

టీడీపీకి భారీ షాక్..



పార్టీలో చేరినవారితో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

రేగిడి : మండలంలో నాయిరాలవలస పంచాయతీ పరిధిలోని రాజావలసలో టీడీపీకి భారీ షాక్ తగిలింది. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ సమక్షంలో 30 టీడీపీ కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనకు ఆకర్షితులమై పార్టీలో చేరినట్లు వారాడ సాయికుమార్, మక్క సూర్యనారాయణ, మక్క శ్రీనివాసరావు, ఉసిడి గంగునాయుడు, రమణ, మక్క నారాయణరావు, తదితరులు అన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గేదెల వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, పార్టీ మండల కన్వీనర్ వావిలపల్లి జగన్ మోహనరావు, మక్క వెంకటరమణ, మక్క చిన్నంనాయుడు, వావిలపల్లి వెంకటరమణ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కొవ్వాడ శ్రీరాములు, రుంకు గణపతి, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ, జనసేన నాయకులు



జనసేన నాయకుడికి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధి పొనుగుటివలస గ్రామంలోని టీడీపీ, జనసేన కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నాయి. ఇప్పటికే గ్రామంలోని 80 కుటుంబాలు ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్ ఆధ్వర్యంలో పార్టీలో చేరగా.. తాజాగా మరో 70 కుటుంబాలు పార్టీ తీర్థం పుచ్చుకున్నాయి. జనసేన నాయకుడు సామంతుల ప్రసాద్‌తో పాటు ఆయన అనుచరులు రాజేష్ సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. అలాగే టీడీపీకి చెందిన దేవకివాడ గౌరునాయుడు, మీసాల సూరి, సురవరపు చిన్నంనాయుడు, పాగిరి చిట్టియ్య, కెంబూరు కృష్ణ, కొమరపురి మంగయ్య, యండమూరి రమణ, తదితరులంతా మాజీ సర్పంచ్ శాసపు కేశవరావు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వారంతా తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాలవలస శ్రీనివాసరావు, శాసపు వేణుగోపాలనాయుడు, రెడ్డి రమేష్, గార సత్యనారాయణ, శాసపు అప్పలనాయుడు, ఇనుమల శ్రీను, దూబ మహేష్, బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి పలువురు..

వంగర: మండల పరిధిలోని లక్ష్మీపేట గ్రామంలో టీడీపీకి చెందిన 20 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. వీరికి రాజం ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో నివర్తి అనిల్‌కుమార్, కలమటి రాము, కలమటి గంగులు, కలమటి ముత్యాలు, కలమటి సత్యవతి, కలమటి ప్రకాశం, తదితరులున్నారు.

క్లుప్తంగా

రెండో రోజు 6,005 పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

- ఓటు ఉన్న నియోజకవర్గంలోని ఫెసిలిటేషన్ సెంటర్‌లోనే పోస్టల్ ఓటింగ్



జేఎన్‌టీయూ జీవిలో పోస్టల్ బ్యాలెట్ ఓటు కోసం క్యూలో నిల్చున్న ఓటర్లు

రెండో రోజు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ (నియోజకవర్గాల వారీగా) ఇలా..

నియోజకవర్గం	పోస్టల్ బ్యాలెట్లు	రెండో రోజు
బొబ్బిలి	2,105	843
చీపురుపల్లి	1,405	697
గజపతినగరం	1,655	794
నెల్లిమర్ల	1,525	660
విజయనగరం	3,975	1,449
ఎస్.కోట	1,776	787
రాజాం	1,741	775
మొత్తం	18,631	6,005
ఇతర జిల్లాల్లో..	---	1,039

విజయనగరం అర్బన్: ఓటు ఉన్న నియోజకవర్గంలోని ఫెసిలిటేషన సెంటర్‌లోనే ఉద్యోగితమ పోస్టల్ ఓటు సద్వినియోగం చేసుకోవాలని ఎన్నికల అధికారి ఎస్.నాగలక్ష్మి సోమవారం తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ముఖ్య అధికారి ఆదేశాల మేరకు 7, 8 తేదీల్లో కూడా వీరికి అవకాశాన్ని కల్పించినట్టు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా రెండోరోజు 6,005 మంది ఎన్నికల సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ఓటు వినియోగించుకున్నట్టు వెల్లడించారు.

భారీ వర్షం



విరిగిపడిన చెట్ల కొమ్మలను తొలగిస్తున్న గిరిజన యువత

భామిని: మండలంలో ఈదురుగాలులతో కూడిన వర్షం పడడంతో సోమవారం జన జీవనం స్తంభించింది. ప్రధాన రహదారుల్లో వర్షపునీరు ప్రవహించింది. గాలుల ఉధ్ధృతితో చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. తాటిమానుగూడ వద్ద భారీ మర్రిచెట్టు నేలకొరిగింది. గిరిజన యువకులు రోడ్లపై పడ్డ చెట్ల కొమ్మలు తొలగించడంతో వాహనాల రాకపోకలు కొనసాగాయి. సాయంత్రం నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కొద్ది రోజులుగా ఎండ తీవ్రతకు ఇబ్బందులు పడిన ప్రజలకు ఈవర్షం కొంత ఊరటనిచ్చింది.

వ్యయ రిజిస్టర్ల పరిశీలన

సీతంపేట: సాధారణ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల వ్యయ రిజిస్టర్లను పాలకొండ అసెంబ్లీ నియోజకవర్గ వ్యయ పరిశీలకుడు రమాకాంత్ ప్రధాన్ సోమవారం పరిశీలించారు. ఈ మేరకు స్థానిక ఐటీడీఏలో గల రిటర్నింగ్ ఆఫీసర్ కార్యాలయంలో వాటిని పరిశీలించి రాజకీయ పార్టీల ప్రతినిధులకు పలు సూచనలిచ్చారు. వ్యయ రిజిస్టర్‌లో అభ్యర్థి ఖర్చుల వివరాలు పక్కాగా నమోదు చేయాలని చెప్పారు. ఈనెల 11వ తేదీన మరోమారు రిజిస్టర్ల పరిశీలన ఉంటుందని, ఆ రోజు తప్పనిసరిగా ఖర్చుల వివరాలు పరిశీలన చేయించుకోవాలని అభ్యర్థుల కు సూచించారు. కార్యక్రమంలో వివిధ పార్టీల ప్రతినిధులతో పాటు వ్యయపరిశీలన బృందా లు పాల్గొన్నాయి.

మాటకు నిలబడే వ్యక్తికే ఓటు

- వైఎస్సార్‌సీపీ మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు



గవరమ్మపేటలో ఎన్నికల హామీ పత్రాన్ని మహిళలకు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు

జియ్యమ్మవలస: ఇచ్చిన మాటను నిలబెట్టుకునే వ్యక్తికే ఓటు వేయాలని వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన జియ్యమ్మవలస మండలంలోని గవరమ్మపేట పంచాయతీ పరిధిలో ఉన్న గవరమ్మపేట, వెంకటరాజపురం, ఎరుకలపేట గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆర్థిక అభివృద్ధిని కాంక్షిస్తూ గడపగడపకూ నేరుగా సంక్షేమ పథకాలు అందించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. మరోసారి సంక్షేమ ప్రభుత్వ పరిపాలనకు ఈనెల 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి ఆశీర్వదించాలని ఓటర్లను కోరారు. ఎన్నికల హామీలను పూర్తిస్థాయిలో అమలు చేసిన వ్యక్తి సీఎం జగన్‌మోహన్ రెడ్డి అని, పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగనన్నదేనన్నారు.

చీపురుపల్లిలో సమగ్రాభివృద్ధి

చీపురుపల్లి.. రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు కలిగిన నియోజక వర్గం. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ 58 నెలల పాలనలో ప్రగతి పట్టాలెక్కింది. సాగు, తాగునీటి సమస్యలు పరిష్కారమయ్యాయి. ప్రభుత్వ సేవలు ఊరిలోనే అందుతున్నాయి. పేద, మధ్య తరగతి కుటుంబాల పిల్లలు చక్కగా చదువుకునేందుకు వీలుగా సర్కారు బడులు ముస్తాబయ్యాయి. రాష్ట్రంలోనే మొట్టమొదటి ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ ల్యాబ్ చీపురుపల్లి బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటైంది. ఊరూరా ప్రగతి 'బాటలు' వెలశాయి. రైతన్నకు వెన్నుదన్నుగా ఆర్‌బీకేలు సేవలందిస్తున్నాయి. ఇంటింటా 'నవరత్న' వెలుగులు ప్రకాశిస్తున్నాయి. వివిధ సంక్షేమ పథకాలతో అన్నివర్గాల ప్రజలకు ఆర్థిక సంక్షేమం చేకూరడంతో ప్రభుత్వ పనితీరుపై ప్రశంసల జల్లుకురుస్తోంది.

- రాష్ట్రంలో ప్రత్యేకంగా నిలిచేలా అభివృద్ధి పనులు
- ఇంటింటా 'నవరత్న'కాంతులు
- ఊరిలోనే ప్రభుత్వ సేవలు
- ఇంటింటికీ కుళాయి నీటి సరఫరాకు చర్యలు
- అందంగా ముస్తాబైన సర్కారు బడులు
- అందుబాటులో మెరుగైన వైద్యసేవలు



చీపురుపల్లి మ్యాప్



గ్రామాల్లో పౌరసేవలకు ఆలవాలంగా నిలుస్తున్న చీపురుపల్లి మండలంలోని రామాలింగాపురం సచివాలయ భవనాలు



రైతులకు వరంగా గ్రామాల్లో వెలసిన రామలింగాపురం రైతు భరోసా కేంద్రం



నాడు-నేడు నిధులతో సర్వాంగ సుందరంగా తయారైన చీపురుపల్లి మండలంలోని పేరిపి ప్రభుత్వ పాఠశాల



నియోజకవర్గంలో ఇంటింటికీ తాగునీటి కుళాయిలు

చీపురుపల్లి నియోజకవర్గంలో జూన్ 2019 నుంచి 2024 ఫిబ్రవరి వరకు వివిధ పథకాలతో లబ్ధి

పథకం	లబ్ధిదారులు	లబ్ధి (రూ.కోట్లలో)
వైఎస్సార్ పెన్షన్‌కానుక	42,378	44,73,94,500
జగనన్న అమ్మ ఒడి	26,651	31,74,70,372
వైఎస్సార్ చేయూత	20,937	105,50,81,250
వైఎస్సార్ ఆసరా	48,793	149,97,14,440
వైఎస్సార్ రైతు భరోసా	36,877	127,36,72,150
ఇంటి నిర్మాణం (నేరుగా చెల్లింపులు)	6,245	91,96,15,195
వైఎస్సార్ సున్నా వడ్డీ (ఎస్‌హెచ్‌జీ)	61,524	9,21,76,147
వైఎస్సార్ కాపు నేస్తం	518	2,57,25,000
ఉచిత పంటల బీమా	1,215	2,13,08,485
జగనన్న విద్యా దీవెన	18,706	41,06,52,990
జగనన్న వసతి దీవెన	13,657	22,48,27,998
వైఎస్సార్ నేతన్న నేస్తం	101	95,28,000
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	890	,42,55,000
వైఎస్సార్ బీమా	602	9,27,32,117
రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ	1096	46,56,608
వైఎస్సార్ వాహన మిత్ర	2080	7,11,00,000
సున్నా వడ్డీ పంట రుణాలు	11,372	2,75,61,816

ఇతర పథకాలు

జగనన్న చేదోడు	2454	6,09,80,300
వైఎస్సార్ ఆరోగ్య శ్రీ	13,478	47,92,62,827
తెల్లరేషన్ కార్డుదారులకు కోవిడ్ సాయం	65,668	7,06,89,000
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	8432	17,90,47,640
వైఎస్సార్ మత్స్యకార భరోసా	21	3,10,000
వైఎస్సార్ కళ్యాణ మస్తు, షాదితోఫా	130	91,75,000
జగనన్న తోడు (వడ్డీ)	4934	25,48,061

నాన్ డీబీటీ పథకాల లబ్ధి

పథకం	లబ్ధిదారులు	లబ్ధి (రూ.కోట్లలో)
జగనన్న తోడు	7739	18.91.55,322
వైఎస్సార్ సంపూర్ణ పోషణ	13097	30.00.96.565
జగనన్న గోరుముద్ద	18,174	19,57,26,161
జగనన్న విద్యా కానుక	19,339	16,14,63,384
ఇళ్ల స్థలాలు (భూసేకరణ, పరిహారం చెల్లింపు)	6719	17,71,72,4,00
8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్స్	2751	5,01,57, 445
వెస్సార్ కంటి వెలుగు	15449	35,90,88,672
ఇంటింటికి రేషన్	65,334	177,57,15,928



మెరకముడిదాం మండలంలోని బోదందరవలస మీదుగా చెల్లాపురం వరకు నిర్మించిన తారురోడ్డు

రూ.74.48 కోట్లతో ఇంటింటికీ కుళాయిలు

నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో మంత్రి కృషితో ఇంటింటికీ తాగునీటి సదుపాయం ఉంది. తాజాగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జలజీవన్ మిషన్ పథకం ద్వారా నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఇంటింటికీ తాగునీటి కుళాయిలు పథకాన్ని తీసుకొచ్చారు. చీపురుపల్లి, గరివిడి, గుర్ల, మెరకముడిదాం మండలాల్లో 48,266 నివాసాలకు రూ.74.48 కోట్లు నిధులతో ఇంటింటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేశారు.

చీపురుపల్లి: చీపురుపల్లి మెరకముడిదాం, గుర్ల, గరివిడి మండలాలతో కూడిన చీపురుపల్లి నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో ప్రగతి పట్టాలెక్కింది. ప్రజలకు మంచి చేయాలన్న నాయకులు పాలకులుగా ఉండడంతో అభివృద్ధి పనులు జోరుగా సాగాయి. ఏ గ్రామానికి వెళ్లినా అభివృద్ధి, సంక్షేమ పాలన కళ్లకుకడుతోంది. 14 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబునాయుడు హయాంలో నియోజకవర్గానికి ఒక్క ప్రయోజనమూ చేకూరలేదు. ఒక్క సంక్షేమ పథకమూ నిజాయితీగా ప్రజలకు అందలేదు. జన్మభూమి కమిటీల కాళ్లు పట్టుకుంటే తప్ప ప్రభుత్వ పథకం మంజూరుకాని దుస్థితి. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక పాలనలో కొత్తవిప్లవం ఆరంభమైంది. సచివాలయ వ్యవస్థతో ప్రభుత్వ సేవలు అక్కరకు వచ్చాయి. వేలాదిమంది నిరుద్యోగులకు ఉపాధి కలిగింది. అర్హతే కొలమానంగా సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయి. కోవిడ్ మహమ్మారి ఓ రెండేళ్లపాటు అభివృద్ధికి అడ్డుపడినా... మిగిలిన కొద్దినెలల్లో సంక్షేమ, అభివృద్ధి పాలనతో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల్లో చెరగని ముద్రవేశారు.

రూ.67.55 కోట్లతో ప్రభుత్వ భవనాల నిర్మాణం

ప్రజలకు అన్నిరకాల సేవలందించే ప్రభుత్వ భవనాల నిర్మాణానికి ప్రభుత్వం పెద్దపీట వేసింది. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో రూ.67.55 కోట్లు నిధులతో గ్రామ సచివాలయ భవనాలు, రైతుభరోసా కేంద్రాలు, వెల్‌నెస్ కేంద్రాలు, డిజిటల్ లైబ్రరీలకు భవనాలు నిర్మించింది. మౌలిక సదుపాయాలు కల్పించింది.

రూ.130.96 కోట్లతో తారు రోడ్ల నిర్మాణం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో రూ.130.96 కోట్లు నిధులతో తారు రోడ్లు నిర్మాణం జరిగింది. అందులో భాగంగానే చీపురుపల్లి మండలంలో రూ.17.68 కోట్లు, గరివిడిలో రూ.33.28 కోట్లు, గుర్లలో రూ.35.36 కోట్లు, మెరకముడిదాం మండలంలో రూ.44.46 కోట్ల నిధులతో తారు రోడ్లు నిర్మాణాలు జరిగాయి. దీంతో నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు తారురోడ్లు సౌకర్యం కలిగింది.

సరస్వతీ నిలయాలకు కొత్తసొబగులు

చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ విద్యా వ్యవస్థలో సీఎం జగన్ మోహన్‌రెడ్డి విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారు. అందులో భాగంగానే నాడు-నేడు పథకం ద్వారా రెండు దశల్లో ప్రభుత్వ పాఠశాలలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. నియోజకవర్గంలో నాడు-నేడు ఫేజ్-1లో రూ.30.51 కోట్లు, ఫేజ్-2లో రూ.33.11 కోట్లు నిధులతో పాఠశాలలను అభివృద్ధి చేశారు. కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దారు. పాఠశాలల్లో తాగునీరు, విద్యుద్దీకరణ, డిజిటల్ బోర్డులు, బెంచీలు, మరుగుదొడ్లు ఇలా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు.

రూ.28.38 కోట్లతో 100 పడకల ఆస్పత్రి

చీపురుపల్లిలోని 30 పడకల సీహెచ్‌సీని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తొలుత 50 పడకలకు పెంచింది. స్థానిక పాలకుల చొరవతో నేడు వంద పడకలకు పెంచుతూ మౌలిక సదుపాయాల కల్పనకు రూ.28.38కోట్లతో సదుపాయాలు కల్పిస్తోంది.

రూ.8 కోట్లతో పాలిటెక్నికల్ కళాశాల భవనాలు

2009 నుంచి 2014 మధ్య పరిపాలన సమయంలో మంత్రి ప్రత్యేక శ్రద్ధతో చీపురుపల్లికి ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలను మంజూరు చేయించారు. ఆ తరువాత 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం పాలిటెక్నికల్ కళాశాలను కనీసం పట్టించుకోలేదు. దీంతో పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఖాళీ భవనాల్లో అరకొర వసతులతో తరగతులు నిర్వహించారు. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల సొంత భవనాల కోసం రూ.8 కోట్లు నిధులు మంజూరయ్యాయి. త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తిచేశారు. విద్యార్థులకు భవన కష్టాలు తొలగించారు.

రెవెన్యూ, పోలీస్ సబ్ డివిజన్ల ఏర్పాటు

నియోజకవర్గ ప్రజల చిరకాల కోరికగా మిగిలిన రెవెన్యూ డివిజన్, పోలీస్ సబ్ డివిజన్ కార్యాలయాలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో సాకారమయ్యాయి. 2014 ఎన్నికల ప్రచారానికి వచ్చిన చంద్రబాబునాయుడు అధికారంలోకి వస్తే చీపురుపల్లిను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేస్తామని ఇక్కడి ప్రజలకు హామీ ఇచ్చి మరిచిపోయారు. 2019లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎలాంటి హామీ ఇవ్వకపోయినప్పటికీ మంత్రి చొరవతో చీపురుపల్లిని రెవెన్యూ డివిజన్‌గా స్థాయిని పెంచారు. దీంతో డీఎస్పీ కార్యాలయం కూడా ఏర్పాటయ్యింది. వీటితో బాటు మరికొన్ని కార్యాలయాలు కూడా త్వరలో అందుబాటులోకి రానున్నాయి.



చీపురుపల్లి శివారున నిర్మాణంలో ఉన్న వైఎస్సార్ జగనన్న కాలనీ



వంద పడకల ఆస్పత్రిగా స్థాయి పెరిగిన చీపురుపల్లి సీహెచ్‌సీ



రెవెన్యూ డివిజన్ కార్యాలయం



రూ.8 కోట్లతో ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల భవనం

నిర్భయంగా ఓటేద్దాం

- స్వీప్ ర్యాలీని ప్రారంభించిన ఎన్నికల పరిశీలకుడు తలాత్ పర్వేజ్



దాసన్నపేట కూడలిలో ఓటు వినియోగంపై ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు



ర్యాలీలో పాల్గొన్న జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకుడు తలాత్ పర్వేజ్ ఇక్బాల్ రోహిల్లా, అసిస్టెంట్ కలెక్టర్ త్రివినాగ్

విజయనగరం అర్బన్: ఓటర్లందరూ తమకు నచ్చిన అభ్యర్థికి నిర్భయంగా ఓటేయాలని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సాధారణ ఎన్నికల పరిశీలకుడు తలాత్ పర్వేజ్ ఇక్బాల్ రోహిల్లా పిలుపునిచ్చారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన మహిళల ర్యాలీని విజయనగరం కోట కూడలి వద్ద ప్రారంభించారు. ఇది సింగపూర్ సిటీ కూడలి వరకు సాగింది. దాసన్నపేట కూడలిలో మానవ హారాన్ని నిర్వహించి ఓటుహక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్ మాట్లాడుతూ ఈ నెల 13వ తేదీన జరిగే ఎన్నికలు ప్రజాస్వామ్యానికి పండగ వంటివని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య మనుగడకు ఎన్నికలే మూలాధారమన్నారు. గత ఎన్నికల్లో పురుషుల కంటే మహిళల ఓటింగ్ నమోదు ఒక్కశాతం అధికంగా నమోదయిందని చెప్పారు. శతశాతం ఓటింగ్ నమోదు దిశగా జిల్లా యంత్రాంగం కృషి చేస్తోందని తెలిపారు. యువ ఓటర్లంతా ముందుకు వచ్చి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి, హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు, జిల్లా క్రీడాధికారి వెంకటేశ్వరరావు, స్వీప్ రీసోర్స్ పర్సన్ పద్మనాభం, మున్సిపల్ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

మొదటి విడత స్ప్రేయింగ్ పకడ్బందీగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.జగన్‌మోహనరావు

- డీఎంఓ డాక్టర్ టి.జగన్‌మోహనరావు

పార్వతీపురంటౌన్: దోమల నివారణ మందు స్ప్రేయింగ్ మొదటి విడత పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు ఆదేశించారు. ఈ మేరకు సబ్ యూనిట్ అధికారులు, మలేరియా టెక్నికల్ సూపర్‌వైజర్స్‌తో మలేరియా కార్యాలయంలో సోమవారం ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎంపిక చేసిన 401 మలేరియా ప్రభావిత గ్రామాల్లో ఈనెల 15వ తేదీ నుంచి నిర్వహించనున్న మొదటి విడత ఐఆర్‌ఎస్ స్ప్రేయింగ్‌కు ముందస్తుగా వేసిన ప్రణాళిక ప్రకారం కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. వీటికి సంబంధించిన మార్గదర్శకాలను ఇప్పటికే జారీ చేసినట్లు చెప్పారు. జిల్లాలో ఉన్న ఏడు సబ్‌యూనిట్స్ పరిధిలో స్ప్రేయింగ్ నిర్వహించాల్సిన గ్రామాల వివరాలను పీహెచ్‌సీల వారీగా పరిశీలించారు. ఆయా గ్రామాల పరిధిలో సమన్వయ శాఖతో సమావేశాలు నిర్వహించి ఇంటింటికీ చేపట్టబోయే ఐఆర్‌ఎస్ స్ప్రేయింగ్ కార్యాచరణపై సమీక్షించాలని సూచించారు. స్ప్రేయింగ్ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని చెప్పారు. సిబ్బంది సమష్టిగా కృషి చేసి మలేరియా, డెంగీ తదితర జ్వరాలు అదుపులో ఉండేందుకు పాటుపడాలని కోరారు. సమావేశంలో ఏఎంఓ సూర్యనారాయణ, వీబీడీ కన్సల్టెంట్ రామచంద్ర, ఈఓ నాగేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.